తాగితేగాని అవి లోనికి పోవడం లేదు. గ్లాసు అడుగున కొద్దిగా వున్నాయి నీళ్ళు.

"అమ్మా! నీళ్ళు!" అడిగింది సత్య.

లంచ్ వేళకి కూతురింటికి రావడంతో ఆమె పగటి నిద్రకి భంగం కలిగింది. ఇటు కూతురు అన్నం తింటున్న ఆ స్వల్ప వ్యవధిలోనే ఓ కునుకు తీద్దామని చీరె చెంగును నేల పరుచుకొని మేను వాల్చింది అన్నపూర్ణమ్మ. కూతురి పిలుపుతో కళ్ళు తెరిచి, వంటింటి వరండాలోని నీళ్ళ కుండవైపు చూసి గతుక్కుమంది!

"అయ్యో- అయ్యో! ఛీ-ఛీ" అంటూ గభాల్న లేచి, పరుగు లాంటి ఓ ప్రయత్నం చేసింది.

కుక్క మూతి పెట్టిన నీళ్ళ కుండని చూసింది సత్య. ఆమెకు ఏడుపొచ్చినంత పనైంది. గ్లాసు అడుగున వున్న ఆ కాస్త నీళ్ళు తాగింది. దాహం కట్టలేదు. పింగాణీ కప్పులో వున్న 'నీళ్ళలాంటి మజ్జిగ' కూడ తాగింది. వూహూఁ! మెతుకులు గొంతులోంచి కిందకు దిగినట్టులేదు.

తింటున్న అన్నాన్ని సగంలో వదిలేసింది. చిరాగ్గా లేచి పెరట్లో కెళ్ళి గోలెం దగ్గర చెయ్యి కడుక్కొంది. ఆమెకి కడుపులో ఎక్కు పెట్టినట్లయ్యింది. మంచినీళ్ళ కుండ దగ్గర కొచ్చింది. వెనక్కి తిరిగి తల్లిని చూసింది. కుక్కని కొట్టడానికి ఆమె పెరటి కొసదాకా వెళ్ళింది. సత్యకి గొంతు మండి పోతోంది.

'పోనీ....ఈ నీళ్ళు తాగేస్తే... ఛీ-ఛీ' అనుకొంది సత్య. చర చరా లోనికి వచ్చింది. గుమ్మం మీద తల పెట్టుకొని గుర్రు పెడుతున్నాడు తండ్రి. అలా విశ్రాంతిగా నిద్రపోతున్న తండ్రిని చూసి ఆమెకు అసూయ కలిగింది. తలుపుమీద ఆరవేసిన కంపు కొడుతున్న తువ్వాల్తో అసహ్యించుకొంటూనే చేతులూ, మూతీ తుడుచుకొంది. పెరట్లో తల్లి కేకలు సత్యకివినిపిస్తూనేవున్నాయి.

"ముష్టి వెధవ కుక్క! వెధవ కుక్క అది. మా బాగా దాపురించింది. దొరికిందికాదు- కాలు విరగ్గొట్టేద్దును." ఇలా కేకలేస్తూ, ఆయాసపడుతూ కుక్కనుతిడుతోంది అన్నపూర్ణమ్మ. చేతిలోని కొరకంచుని నీళ్ళబొయ్యి దగ్గర పారేసి, గోలెం దగ్గర కాళ్ళూ చేతులూకడుక్కొంది. చీరచెంగుతో చేతుల్ని తుడుచుకొంటూ గబగబా ఇంట్లోకి వస్తూ- "చెట్టంత మనిషి

ఇంట్లో వుండి ఏ సాయమూలేదు. ఆ పెరట్లో దడి కొంచెం బాగు చెయ్యండి బాబూ కుక్కలొచ్చి దూరబడి పోతున్నాయని ఎంత మొత్తుకుంటున్నా పట్టించు....” ఆమె హఠాత్తుగా అరవడం మానేసింది. భార్య కేకలతో రామారావుకి నిద్రాభంగం అయింది. సగం తింటూ కూతు రొదిలేసిన అన్నం కంచం చూసి అన్నపూర్ణమ్మ మనసు చివుక్కుమంది.

“ఎవరి మీదనే నీ కోపం? సగం తింటూ లేచిపోతావా? కాస్సేపాగు—పక్కింటి వాళ్ళనడిగి కొళాయి నీళ్ళు తెస్తాను.” ఆ తల్లి గొంతులో బాధ, కోపం ధ్వనిస్తున్నాయి.

“ఆక్కర్లేదు.” వీధి గడపలో దూలం మీద పెట్టిన చెప్పుల్ని తీస్తూ విసురుగా అంది సత్య.

“టిఫిన్ తింది కాబోలే—ఆకలిగా లేదేమో!” భార్యకి సర్ది చెబుతూ ఆవలిస్తూ తిరిగి నిద్రకుపక్రమించాడు రామారావు. తండ్రి మాటలతో సత్యకి చిర్రెత్తుకొచ్చింది. తెగిపోవడానికి సిద్ధంగా వున్న చెప్పుల్ని వేసుకొని విసవిసలాడుతూ వీధిలోనికి వచ్చేసింది.

సత్యకి గొంతులో మంటగా వుంది. లోపల ఏదో అడ్డుపడ్డట్టుగా వుండి, ఇబ్బంది పెడుతోంది. పైగా ఎండ నెత్తిని మాడ్చేస్తూ ఆమె దాహాన్ని ఎక్కువ చేస్తోంది.

సత్య కీ రోజు వెర్రి కోపం వచ్చింది. ఆమె గురించి ఏ పాటి శ్రద్ధా తీసుకోని తల్లిదండ్రుల మీద మండు కొస్తోంది. ఆమెకీ బ్రతుకు దుర్భరంగా తోస్తోంది.

ఆమెకు తన కోర్కెలు పండే ఆనందం నిండే వేరే ప్రపంచం కావాలి! కాని, ఎలా....ఎలా? ఎండ తీవ్రంగా కాస్తూనే వుంది. ఆమె విపరీతంగా ఆలోచిస్తూనే వుంది.

* * *

అన్నపూర్ణమ్మ కాపురానికి వచ్చిన చాలా సంవత్సరాల వరకూ సంతానం కలగలేదు. పెళ్ళయి పదేళ్ళు దాటుతున్నా పిల్లలు పుట్టకపోవడంతో ఇక పుట్టరనుకున్నాడు రామారావు. కాని, అతని ఆలోచనల్ని తలక్రిందులు చేస్తూ అన్నపూర్ణమ్మ నెల తప్పింది. అతను చాలా ఆనందించాడు. ఆమె మగబిడ్డని ప్రసవించింది. ఆ యింట్లో ఆనందం వెల్లి విరిసింది.

ఆ తర్వాత మూడేళ్ళకు సత్య పుట్టింది. ఆమె పుట్టిన ఏడెనిమిదేళ్ళ తర్వాత మళ్ళా ఇద్దరు మగ

బిడ్డలు పుట్టారు. ఆలస్యంగానైనా పుట్టిన నలుగురి బిడ్డలతో రామారావు సంసారాన్నీదు కొస్తున్నాడు. కొంచెం కష్టంగానే వున్నా— పిల్లలతో యిల్లు కళకళలాడుతూ- అతనికి ఆనందం కలిగిస్తోంది. పెద్దవాడు వేణు పియ్యూసీ మంచి మార్కులతో పాసవ్వడంతో తన శక్తికి మించిన పనే అయినా వాణ్ని విశాఖపట్నంలో కాలేజీలో చేర్పించాడు రామారావు కాలం గడుస్తోంది.

విశాఖపట్నంలోను, తెలుగు దేశంలోనూ 'స్టీల్ ప్లాంట్' ఆందోళన సుడిగాలిలా వచ్చింది.

ఆ అలజడిలో పోలీసుల గుళ్ళకి బలై పోయాడు వేణు! చేతి కందొస్తాడన్న కొడుకు అలా హఠాత్తుగా పోవడంతో రామారావుకి పెద్ద దెబ్బే తగిలింది. ఇక అన్నపూర్ణమ్మైతే కడివెడు కన్నీళ్ళు కారుస్తూ దుఃఖంతో మంచం పట్టేసింది.

ఇన్నాళ్ళూ ముద్దుగా పెరుగుతూ, చదువును అశ్రద్ధ చేసిన సత్యకి, యీ సంఘటనతో కాస్త విజస్థితి వంటబట్టింది. ఇటు తల్లికి సేవ చేస్తూ, అటు ఇంటి పనులు చూస్తూ, చదువు మీద కూడ శ్రద్ధ చూపడం ప్రారంభించింది. ఎలాగయితేనేం పద్దెనిమిదేళ్ళు వింటాక మెట్రిక్ పాసయిందని పించుకొంది.

రామారావు కిప్పుడు పిల్లలు పుట్టారన్న సంతోషం ఏ మాత్రమూ లేదు. వాళ్ళే దార్లో పడకుండానే అతను రిటైరయ్యే దశ అట్టే దూరం లేకపోవడంతో అతని గుండె గుభేలు మంటోంది.

అటు అఫీసులోని, ఇటు డిపార్ట్‌మెంట్‌లోని పెద్దల కాళ్ళూ చేతులూ పట్టుకొని, తనాఫీసులోనే సత్యకి వుద్యోగం వేయించుకొని కాస్త వూపిరి పీల్చుకొన్నాడు రామారావు. భవిష్యత్తులో తన సంసార రథం ఏ బాటలో నడవాలో ఆలోచనలు చేస్తున్నాడు.

* * *

ఎండ తీవ్రంగా కాస్తూనే వుంది. సత్య దాహాన్ని పెంచుతూనే వుంది. శరీరం ఎండకు కంది మరింత మెరిసిపోతోంది. ఆమెకు ఎదురుగా ఓ స్కూటర్ మీద యిద్దరు యువకులొస్తున్నారు. జోరు తగ్గిస్తూ తగ్గిస్తూ రావడం గమనించింది సత్య. మెల్లగా ఆమె ప్రక్కనుండి వెళ్ళి పోయింది స్కూటర్. 'వ్వాటె బ్యూటీ!' లొట్టలు వేసిందో గొంతు. 'యయ్యా' వంతపాడిందో

కంఠం. సత్య కా మాటలు విన బడ్డాయి. అంత చిరాకులోనూ చిన్నగా నవ్వుకొంది.

అహో రాత్రులు శ్రమించి ప్రతిభా వంతుడూ రసజ్ఞుడూ అయిన శిల్పి రూపొందించిన ఓ అపురూప శిల్పంలా వుంటుంది సత్య. మంచి పొడుగు, పొడుక్కి తగ్గ లావు, చక్కని శరీర ఛాయతో, కను ముక్కు తీరుతో, ఎంతో అందంగా, ఆరోగ్యంగా మెరిసి పోతూ వుంటుంది. పాతి కేళ్ళ ప్రాయంతో, పరిణతి చెందిన అవయవ పొంకంతో, యువకుల కళ్ళు 'జిగేల్' మనే ఆకర్షణతో వెలిగిపోతోంది సత్య.

కాని....ఆమె ఆవేదన తీరే దారి!?

ఇంత అందం, మత్తెక్కించే తియ్యని తీరని కోర్కెలూ-ఇలా ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు? అందమైన తన జీవితం ఇలా ఆఫీసు కుర్చీకీ, పై ళ్ళకీ అంకితం కావలసిందేనా? తన అందచందాల్ని ఇంతగా ఆరాధిస్తూ మెచ్చుకుంటున్నారే— ఒక్కడు కూడ కట్నం తీసుకో కుండా తనని పెళ్ళాడ్డానికి ముందుకు రాడేం?

ఇలా ఆలోచిస్తూ నడుస్తోంది!

ఆమె దాహం పెరుగుతూనే వుంది అంతకంతకూ.

* * *

సత్యకి తన ఆఫీసులో వుద్యోగం వేయించాక రామారావు సంసారం సాఫీగా సాగిపోతోంది.

'తనింకా ఏడాదిపాటు సర్వీసులో వుంటాడు. ఈ ఏడాదిలో వచ్చిన రెండు జీతాల్లో సత్యజీతం వెనకేసి పెళ్ళి చేసెయ్యొచ్చు. ఆటు తరువాత?—ప్రావిడెంట్ ఫండు, గ్రాట్యుటీ అందుకొని చిన్న వ్యాపారం పెట్టుకుంటే-అందులో వచ్చే లాభాలతో పెన్షన్ డబ్బులతో గుట్టుగా సంసారాన్ని లాగించే య్యొచ్చు. చిన్నవాళ్ళద్దర్నీ చదివించి వాళ్ళకో తెరువు చూపించి హాయిగా వూపిరి పీల్చుకోవచ్చు. ఇలా భవిష్యత్తును గురించిన బాటలు వూహల్లో వేసు కొంటున్నాడు రామారావు.

కాని-చిత్రంగా ఇంట్లో ఖర్చులు పెరిగిపోతూండడం అతనికి ఆశ్చ ర్యంగా వుంది. మధ్య తరగతి కోర్కెలూ, సాంప్రదాయాలూ అతని ఆలోచనలను 'ఆలోచన గానే' వుంచేశాయి. తన ఒక్కడి జీతంతో సంసారాన్ని నెట్టుకొస్తున్న ప్పుడు అణగారిపోయి వున్న కోర్కెలూ, అవసరాలూ- రెండు జీతాలు రావడంతో విజృంభించాయి.

వారు, పచ్చడి మెతుకుల్తో కూడిన భోజనంలో వాటిని సరిపెట్టుకో కుండా- కూరా, పెరుగూ వచ్చి కలి శాయి. చిరుతిళ్ళు తినడం, పిని మాలు చూడ్డం పెరిగిపోయాయి.

రామారావు రిటైరై చేతికందా ల్సిన సొమ్ము అందిన తరుణంలో అతని దూరపు బంధువొకడు సత్యకో సంబంధం తెచ్చాడు. అబ్బాయి బి కాం. పాసై, బాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రు లతో వచ్చి ఆ కుర్రాడు సత్యని చూశాడు. సత్యకూడా సిగ్గుని, బిడి యాన్ని పక్కకినెట్టి వికితంగానే చూపిందతణ్ని.

కుర్రాడు అందంగా, ఆరో గ్యంగా, ఆకర్షణీయంగా వున్నాడు. ఆమెలో మధురమైన వూహలు వువ్వెత్తున లేచాయి. సత్య కతను చాలా నచ్చాడు. సత్యక్కూడా పెళ్ళికొడుకు నచ్చాడన్న విషయం అన్నపూర్ణమ్మ గ్రహించింది. పిల్లాడు కూడా పిల్లను మెచ్చాడు. కాని, వాళ్ళకి నచ్చందల్లా రామారావు చెప్పిన కట్నం ఫిగరే!

పెద్దల మధ్య బేరం సాగింది. ఇరవై ఏళ్ళ సత్య మనసులో ఆందోళన రేగింది. అవతల వాళ్ళు కోరిన మొత్తానికి ఓ వెయ్యిలో జంకేశాడు రామారావు. తండ్రిని లోనికి పిలిచి వాళ్ళు కోరిందిచ్చేయ మని చెప్పాలనుకొంది సత్య. కాని చెప్పలేకపోయింది. ఇంకేం వుంది? ఆ సంబంధం తప్పిపోయింది.

అలా జరగడంతో సత్యకి చాలా కష్టం వేసింది. ఇంట్లో ముభావంగా వుండిపోవడం మినహా తన విరసనను వేరే ఏ విధంగానూ వ్యక్తం చేయలేకపోయింది. అప్ప ట్నుంచే ఆమె అంతరంగంలో తన వారిమీద ద్వేషం పుట్టు కొచ్చింది.

పిల్లలు చిన్నవాళ్ళనీ, సంసారం సాగడానికి వ్యాపారంపెట్టి తీరాలనీ, వున్న డబ్బంతా కట్నంకీ, పెళ్ళికీ పెట్టేస్తే వ్యాపారానికి పెట్టుబడిగా మరేం మిగలదనీ, ఏడాదిలోగా ఈ సంబంధాన్ని మించినది తెచ్చి పెళ్ళి దివ్యంగా చేస్తాననీ సత్యకి నచ్చజెప్పాడు రామారావు.

చేతికందిన డబ్బుతో చిన్న బడ్డీ కొని వ్యాపారం మొదలెట్టాడు. కాలం గడుస్తోంది కాని, కాసులు కళ్ళబడటం లేదు. వ్యాపారంలో అనుభవంలేక, అందులోనికిటుకుల్ని అలవర్చుకోడం చేతకాక, చేతులు కాల్చుకున్నాడు రామారావు. అన్నేళ్ళ కష్టానికి ప్రతిఫలంగా అందిన డబ్బు ఆరేడు మాసాల్లోనే

హరించుకుపోయింది. రామారావు వ్యాపారం అక్కడ నలుగురూ చెప్పుకునే 'అచ్చట'గా 'మూణ్ణాళ్ళ ముచ్చట' గా ముగిసిపోయింది.

మంచి సంబంధం తెచ్చి పెళ్ళి చేస్తానని అతనిచ్చిన మాట, మాట గానే మిగిలిపోయింది. కాలం వేగంగా దొర్లుతుండగా 'ముదిరి పోతున్న కన్య గా నే' మిగిలి పోయింది సత్య. వ్యాపారానికి పెట్టు బడిగా పెట్టిన సొమ్మంతా హరిం చుకుపోవడంతో ఆ కుటుంబం మనుగడకి, జీతం తెస్తున్న సత్య జీవితమే పెట్టుబడిగా అంకితమై పోయింది.

* * *

కనబడ్డ కిళ్ళీబడ్డీల వైపు, అం దులో కనబడుతున్న డ్రింక్స్ వైపు, సోడాలవైపు ఆశగా చూసింది సత్య. విసురుగా ఇంట్లోంచి వచ్చేస్తూ పర్స్ మరచిపోయి నందుకు తనని తానే నిందించు కొంటూ, ఎండ మండిపోతూ, గొంతు ఎండిపోతున్నా ఆలోచన లతో నడక సాగిస్తూనేవుంది.

చిత్రాతి చిత్రంగా తయారై ఆనందం వెల్లివిరిసే వదనాలతో సినిమాలకొస్తున్న జంటలు, తనలో వెలితిని ఎత్తి చూపుతున్నాయి. ప్రతి సినిమాలోను విధిగా ఎదు రయ్యే శృంగార దృశ్యాలు తన మనసులో గిలిగింతల మందారాలు పూయిస్తున్నాయి. నిండు జాబిలిని, పండు వెన్నెలను చూపినా, మై మరపించే మల్లెల్ని, మత్తెక్కించే మరువాల్ని వాసన చూపినా, తన నరాలు లాగేస్తూ మతి పారేసుకుం టోంది. పడుచుదనంతో పరుగులు తీసే కోరికలకు పగ్గాలు వేయడం తన శక్యంగాకుండాపోతోంది. వయస్సు సహజంగా సృష్టిస్తున్న తి[illegible]ని తీరని ఈ బాధలకంటే తల్లి దండ్రులు తన భవిష్యత్తు గురించి ఏ ప్రయత్నం చెయ్యకుండా నిర్లి ప్తంగా వుండిపోవడం ఆమెకు మరింత ఆవేదననూ, దుఃఖాన్నీ కలిగిస్తోంది. ఆమెకు తెలియ కుండానే వారిపట్ల ద్వేషం, కసీ పెరిగిపోతుంది. ఇక తన దృష్టి తోనే ఆమె ఆలోచనలు ప్రారంభిం చడం చాలా కాలంగా సాగి పోతుంది.

ఇలా ఆలోచిస్తూ నడుస్తున్న సత్యకి అలసట వచ్చింది. ఎండ భరించడం కష్టంగా తోచింది. దాహానికి తట్టుకోవడం తనకు దుర్భరంగా వుంది. రోడ్డు పక్కన చెట్టు నీడను కాస్సేపాగింది సత్య. ఇప్పుడు ప్రాణానికి కాస్త హాయిగా వున్నట్టనిపించింది. మొహానికి,

చేతులకి పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకొంది. ఆమె తిరిగి నడక ప్రారంభించ బోతుండగా-

"ఆపవోయ్—ఆపు!" తన ముందో రిక్షా ఆగింది. అందులో కమలా, ఆమె చెల్లి విమలా వున్నారు. కమలా, సత్యా కలిపి చదువుకున్నారు. కమలకి పెళ్ళయ్యింది, ముగ్గురు పిల్లలు. విమలకీ నిరుడు పెళ్ళయిపోయింది.

"హల్లో సత్యా! ఆఫీసుకా?" ఛలాకీగా అడిగింది. సత్య ఔనన్నట్లు తలూపింది.

"చూసావే దీన్ని! పెళ్ళయి ఏడాది కాలేదు; అప్పుడే ప్రోగ్రెస్." చెల్లెల్ని ముద్దుగా ఎగతాళి చేసింది కమల. అప్పుడు విమలను తేరిపార చూసింది సత్య. ఆ అమ్మాయి నిండుగా, తృప్తిగా మెరిసే కన్నులతో చూడ ముచ్చటగా వుంది. సత్య తనకేదో-ఏదో వెలితిగా ఫీలయ్యింది.

"దీన్ని పురిటికి తీసుకు రమ్మని అమ్మ నన్ను పంపించిందే! నా సైన్యాన్ని అమ్మ దగ్గరుంచి దీన్ని అత్తారింటి నుంచి తీసుకొస్తున్నాను." గడగడా మాట్లాడేస్తూంది కమల.

"ఇంకా ఎంతసేపమ్మా? ఇలా అయితే మావుఁ కూడు తిన్నట్టే." రిక్షా వాలా గొణుగుడు.

"సారీ సత్యా! నీకు ఆఫీసుకైం అయిపోతోందేమో! సాయంత్రవోఁ ఆదివారవోఁ మా యింటికి రావే! పదవోయ్! వస్తాం." రిక్షా కదిలిపోతోంది. అటే చూస్తూ సత్య మరి కాస్సేపు నిలబడి పోయింది.

చెట్టు మీద చప్పుడయితే తలెత్తి చూసింది సత్య. కొమ్మ మీద రెండు గువ్వలు కొత్త హొయలు పోతూ ఆనందంగా మెలికలు తిరిగి పోతున్నాయి. సిగ్గుతో తలవాల్చింది సత్య.

చెట్టు మొదట్లో రెండు కుక్కలు నాలుకలు వెళ్ళబెట్టి స్వేచ్ఛగా సృష్టి కార్యాన్ని జరుపుకొంటున్నాయి. ఆ దృశ్యాన్ని చూసీ, చూడనట్లు ముఖం తిప్పేసి నడక ప్రారంభించింది సత్య. ఆమె దాహం పెరిగిపోతోంది.

కొట్టొచ్చినట్టు ఆర్భాటంగా గోడ మీద వున్న సినిమా పోస్టర్ పై ఆమె కళ్ళు పడ్డాయి. మేకప్‌లో వయసును దాచుకునే ప్రయత్నం చేస్తూన్న ఇద్దరు ముసలి హీరోలు- వాళ్ళ కూతుళ్ళ వయసున్న హీరోయిన్లని కౌగిళ్ళలో బంధించారు. ముక్కుకి ముక్కు తగిలిస్తూ కళ్ళల్లోకి చూస్తూ-సిగ్గూ బిడియం లేని శృంగారాన్ని ఒలకబోస్తున్నారు.

గతిలేక ఆ అమ్మాయిలు సిగ్గుతో ముడుచుకు పోతున్నారా అన్నట్టున్నారు.

మనసు ఆదోలా అయిపోతూన్న సత్యకి అప్రయత్నంగా జ్ఞాపకం వచ్చాడు క్రిష్ణారావు.

ఆఫీసులో వాళ్ళ బాస్ క్రిష్ణారావు. చాల హుషారుగా, కలుపుగోలుగా వుంటాడు. అతను చెప్తేనే గాని అతనికి నలభై ఏళ్ళని కాని, పెళ్ళయి ముగ్గురు పిల్లల తరువాత చాలనుకొని ఆపరేషను చేయించుకున్నాడని కాని- ఎవ్వరూ పోల్చుకోలేరు. అంత టిప్‌టాప్‌గా ఆకర్షణీయంగా వుంటాడతను.

తన జీవితంలో తటస్థ పడ్డ ఒకే ఒక పెళ్ళి చూపుల ముచ్చట తన కింకా జ్ఞాపకం వుంది. ఆ బాంక్ కుర్రాడి పోలికలు క్రిష్ణారావులో కన్పిస్తూ వింతైన అనుభూతికి తాను లోనౌతోంది. క్రిష్ణారావు తనని ఆకలి చూపులు చూడటం యిబ్బందిగానే వున్నా, లో లోపల తనకు తెలియకుండానే పరవశం కలుగుతోంది.

అతనంటే ఆమెకూ ఆకర్షణే. అయినా ఆమె కోర్కెలను అదుపులో పెట్టి మెలుకొంస్తోంది.

రక్తం ఉడికిపోతూంటే తీవ్రంగా ఆలోచిస్తూ అడుగులు వేస్తోంది సత్య. ఆమె దాహం ఎక్కువవుతూంది.

తూర్పు కొండలమీంచి వేగంగా వీస్తూ గాలి వస్తోంది. ఇప్పుడామె ప్రాణానికి కొంచెం తెరిపిగా వుంది.

ఉన్నట్టుండి సూర్యుడు మబ్బుల మాటుకు వెళ్ళిపోవడంతో ఎండ మాయమైంది. ఆకాశంలో ఏనుగులు పరుగెడుతున్నట్టు నల్లని మబ్బులు అతి త్వరగా కమ్ముకుంటున్నాయి. వాతావరణం క్షణాల్లో మారిపోవడం సత్య గమనించింది. ఈ సారి తూర్పు కొండల గాలి తనకు తోడుగా వర్షాన్ని తెస్తోంది.

నడక వేగాన్ని హెచ్చించింది సత్య. టుపుక్కున జోడు తెగి రోడ్డుమీద వుండిపోయింది. వున్న జోడును కూడ కసిగా విసిరేసింది. ఇప్పుడామెకు ఎంతో తేలికగా వుంది. నడవటం చాలా హాయిగా వుంది.

విపరీతంగా గాలివీస్తూ ఆమె చీరను, ముంగురులను చిత్రంగా ఎగరవేస్తూంది. అప్పుడప్పుడు చినుకులు పడుతూ ఆమెకు అహ్లాదాన్ని కలిగిస్తున్నాయి; గిలిగింతలు పెడుతున్నాయి; హాయి గొలుపుతున్నాయి.

తన ఆఫీసుచేరి తన సీట్లో

కూర్చోబోతోంది సత్య.

"అమ్మగారూ! మీరు రాగానే రమ్మని చెప్పారు అయ్యగారు." కర్తవ్యాన్ని నిర్వహించాడు ప్యూన్. ముంగురులను కొన వేళ్ళతో ఎగదోసి చీర సర్దుకొని బాస్ గది వైపు బయలుదేర బోయింది సత్య.

"అయ్యగారు అక్కడ లేరమ్మా! గెస్ట్ హౌస్‌లో వున్నారు. వుదయం మీ కిచ్చిన ఫైలు తెమ్మన్నారు." చెప్పాడు ప్యూన్.

ఆ ఆఫీసు కాంపౌండ్ చాలా పెద్దది. అందులో ఒక మూలగా వుంది గెస్ట్‌హౌస్. బయట చినుకులు వొత్తుకుంటున్నాయి. ఫైల్ తీసింది సత్య. చినుకులకు తడిసి పోకుండా చెంగు చాటునవుంచి పరుగులాంటి నడకతో సాగి పోతోంది.

ఒత్తుకొంటున్న చినుకులు పెద్ద వర్షంగా మారుతూంటే గెస్ట్ హౌస్ మెట్లెక్కింది సత్య. తలుపు చేరవేసి వుంది. బయట నిలబడింది. అక్కడ ప్యూన్‌లేడు. కాలింగ్ బెల్ నొక్కింది.

"కమిన్!" బాస్ గొంతు ఆమెకు కమనీయంగా వుంది. తలుపు తోసి లోనికి వెళ్ళింది. మళ్ళా తలుపు దానంతటదే మూసు కొంది. సత్య కాళ్ళక్రింద కార్పెట్ మెత్తగా తగుల్తూ సుఖాన్నిస్తోంది. ట్రిమ్‌గా తయారై సోఫాలో కూర్చుని, టిఫిన్ చేస్తున్నాడు క్రిష్ణారావు.

"సారీ సార్! మళ్ళా వస్తాను." వెనుదిరగబోయింది.

"నో-నో. ఫరవాలేదు— కూర్చోండి!"

సంశయిస్తోంది సత్య.

"ప్లీజ్ - కూర్చోండి!" అతని గొంతులో ఆప్యాయత ధ్వనించింది.

ఫైల్‌ను టేబుల్‌మీద పెట్టొచ్చి అతని ప్రక్కనే వున్న చిన్న సోఫాలో కూర్చుంది. క్రిష్ణారావు ఈలోగా మరో ప్లేట్లో టిఫిన్ సర్దాడు స్వయంగా.

"తీసుకోండి!"

"సారీ సార్! ఇప్పుడే భోజనం చేశాను."

"పోనీ స్వీట్ తీసుకోండి. భోజనం చేశాక స్వీట్ తింటే మంచిది. వూ."

ఇక బాగుండదని ఒక జిలేబీ తీసుకొని తింటోంది సత్య. సీసాలోని చల్లని నీళ్ళు గ్లాసులో పోసి అందించాడు. అందుకొని గడగడా తాగేసి, అంత ఆత్రంగా తాగినందుకు సిగ్గుపడింది. ఆమె

తాగిన తీరు చూసి మరో గ్లాసు అందించాడు. ఆ నీళ్ళు కూడ తాగేసింది. కడుపులో హాయిగా వుంది. కృతజ్ఞతతో అతని వైపు చూసి-

"ఉదయం మీరిచ్చిన ఫైల్లో బిల్స్ అన్నీ చూసేసాన్ సార్! సరిగ్గావున్నాయి. ఫైలు తెచ్చాను."

"గుడ్!....సత్యా!"

"ఏం సార్?"

"మరేం లేదూ! సర్కిల్ ఆఫీసులో కాన్ఫరెన్స్ వుంది. రేపు విశాఖపట్నం వెళ్ళాలి నాకు మీ తోడు-ఐ మీన్ అసిస్టెన్స్ కావాలి. వస్తారా?" అతను అడిగిన తీరుకీ, అందులోని కొంటెతనానికీ ఆమెకు సిగ్గు ముంచుకొచ్చింది.

"నేను పర్సనల్‌గా కోరినప్పుడు అభ్యంతరం పెట్టరన్న నమ్మకం వుండబట్టే నాతో మీకు ఆన్ డ్యూటీ వేశాను."

ఆమె మౌనంగా వింటోంది. ఎందుకో ఆమెకు ఆనందంగానే వుంటోంది.

"మీ కంపెనీ నాక్కావాలి."

ఆమె గుండె వేడెక్కి వేగాన్ని పుంజుకుంటోంది.

"సరదాగా నాలుగు రోజులు వైజాగ్‌లో గడుపుదాం. ప్లీజ్! వస్తారుకదూ?"

"........"

"మీ మౌనాన్ని అంగీకారంగా తీసుకోవచ్చా?....ఆఁ?" తొందర చేస్తున్నాడు.

"అలాగే." సిగ్గు మొగ్గలు పూస్తుంటే సన్నగా పలికింది.

"థేంక్యూ! థేంక్యూ వెరీ మచ్!" ఎప్పుడూ లేంది చొరవగా చెయ్యి చాచాడు.

ఆ చెయ్యిని కొంతకాలమైనా అందుకోవాలనీ, ఆ అవకాశాన్ని జారవిడుచుకో కూడదనీ సత్యకు అనిపించింది.

"నా పెటాల్." చెయ్యి కలిపింది.

అతడామెను దగ్గరకు తీసుకొన్నాడు. ఆమె అభ్యంతర పెట్టలేదు.

కౌగిలిలో బిగించాడు. గువ్వలా ఒదిగిపోయింది.

చెక్కిలికి చెంప చేర్చాడు. ఆమె ఒళ్ళు గగుర్పొడిచింది.

వేడి వేడి వూపిర్లు ఒకరినుండి ఒకరికి తాకుతున్నాయి.

అతడామె పెదాల్ని చుంబించాడు. అతణ్ని గాఢంగా హత్తుకొని ముద్దుల వర్షాన్ని కురిపించింది సత్య.

ఆమె తీయని అనుభవంతో తేలిపోయింది.

టీపాయ్ మీదున్న పెద్దసీసా తీసుకొని అందులోని నీళ్ళన్నీ గడగడా తాగేసింది సత్య.

ఇప్పుడామె దాహం పూర్తిగా తీరింది.

సాయంకాలం ఇంటి కొచ్చి, సూట్‌కేసులో బట్టలు సర్ది మూత వేయబోతూ ఆలోచనలో పడింది సత్య.

'తను తప్పు చేసిందా? కుక్క ముట్టిన కుండలోని నీళ్ళు తాగడానికిఅసహ్యించుకొన్నతనిప్పుడేం చేసింది? తన బ్రతుకిప్పుడు కుక్క ముట్టిన కుండ కాదా?'

జీవితంలో మొదటి సారిగా మధ్యాహ్నం ఆమె పొందిన అనుభవం ఇప్పుడామెను ఉద్రేకపడేలా చేస్తోంది. అదే అనుభవాన్ని ఆమె మనస్సు పదే పదే కోరుతుంటే ఆమె ఓ నిశ్చయాని కొచ్చి—

'కాదు గాక కాదు! ఈ తప్పు నాది కాదు!' నిశ్చయంగా అనుకొంది సత్య. ఆమె మనసిప్పుడు తిరుగుబాటు వేదాంతాన్ని వల్లె వేస్తోంది.

'పెంచే శక్తి సామర్థ్యం లేనప్పుడు- ముసలికాలం మీదపడే దాకా పిల్లల్ని కనడం పెద్దల తప్పు కాదా?

వృద్ధాప్యంలో మనిషి జీవితానికి తగిన రక్షణ కల్పించలేని యీ వ్యవస్థది కాదా తప్పు?

అమ్మాయిల అందచందాలు నచ్చినా, వాళ్ళు తెచ్చే కట్నం చాలదని, వాళ్ళని కాలదంతున్న యువకులది కాదా తప్పు?

పాతికేళ్ళు దాటుతున్నా కన్నె చెర విడిపించక, వాళ్ళ సంపాదనతో నిర్లిప్తంగా, నిక్షేపంగా కాలం గడిపేస్తున్న పెద్ద మనుష్యులది కాదా తప్పు?

సామాన్యుల సంసారాలు సాఫీగా సాగిపోకుండా అనర్థాలకు నిలయంగా అష్టవంకర్లూ తిరిగేలా ఆర్థిక వ్యవస్థను అదుపు చేస్తూన్న మొత్తం ఈ వ్యవస్థది కాదా తప్పు?

అసలు తప్పంటూ ఏదేనా వుంటే అది తనదే!

దాహం తీర్చుకొనే తరుణో పాయాలున్నప్పుడు - సాంప్రదాయాల్ని పట్టుకొని ప్రాకులాడ్డమే తప్పు! అదే ఇన్నాళ్ళూ తను చేసిన పెద్ద తప్పు. అంతే!'

ఆలోచనల్ని కట్టి పెట్టింది. సూట్‌కేస్ మూసి తాళం వేసింది.

మర్నాడు విశాఖపట్నం వెళ్ళి, అయిదు రోజులు హాయిగా గడిపి తిరిగొచ్చింది.

అలా తిరిగొస్తూనే వుంది సత్య!

*